క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వైఎస్సార్ తాడిగడప కమిషనర్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ పి.రాజాబాబును వైఎస్సార్ తాడిగడప మునిసిపల్ కమిషనర్‌గా నియమితులైన ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పనిచేసిన ఎన్.ప్రకాశరావు మంగళగిరి–తాడేపల్లి మునిసిపల్ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఈ స్థానంలో ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును వైఎస్సార్ తాడిగడప కమిషనర్‌గా నియమించారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సింహాద్రి



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా–గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వీరు నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి వారి లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అగ్నిప్రమాద బాధితురాలికి రెడ్‌క్రాస్ చేయూత

కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిలిగిన బాధితురాలికి రెడ్‌క్రాస్ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండూరు నాంచారమ్మ నివాస గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి అహుతయింది. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ సభ్యులు బాధితురాలికి వంటసామగ్రి, నిత్యావసర సరుకులు, దుస్తులు, బియ్యాన్ని అందించారు. రెడ్‌క్రాస్ మండల శాఖ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

తుది దశలో కులగణన సర్వే

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే మండలంలో తుదిదశకు చేరుకున్నట్లు ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ మంగళవారం చెప్పారు. ఆయన పర్యవేక్షణలో వక్కపట్లవారిపాలెం సచివాలయం పరిధిలో వెరిఫికేషన్ చేసిన ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ అందించిన వివరాల ప్రకారం 16 సచివాలయాల పరిధిలో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో మంగళవారం మధ్యాహ్నం వరకు 91.02 శాతం కుటుంబాల్లో సర్వే పూర్తయింది. నిర్దేశిత లక్ష్యం 46,941 మంది జనాభాలో 85.68శాతం (40,220మంది) కులగణన వివరాలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా సర్వే విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు.

భావన్నారాయణుని హుండీ కానుకల ఆదాయం లెక్కింపు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లి గ్రామంలో చారిత్రక ప్రసిద్ధి కలిగిన శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి దేవస్థానం హుండీ కానుకల ఆదాయం లెక్కింపు మంగళవారం నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు సమక్షంలో జరిపిన లెక్కింపులో రూ.30,063 ఆదాయం వచ్చింది. ఆలయ ఈఓ చోరగుడి సుధాకర్, అర్చకుడు పంచాంగం రమణాచారి, సుబ్రహ్మణ్యంశాస్త్రి, భోగాది రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కారం

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఎంతో దోహదపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు వైద్యాధికారులకు లింగ వివక్ష నిర్మూలన, మహిళల హక్కులు, నిబంధనల రక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలు, నర్సింగ్ కేంద్రాలు, లేబొరేటరీల యజమానులు లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు సూచనలు

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మామిడి పూత, పిందె దశలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.రమేష్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని మేళ్లమర్తిలంక గ్రామంలో మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. వీఏఏ టి.రాజశేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మంచి చేసిన వారిని మరచిపోవద్దు

- మళ్లీ మళ్లీ మంచి కావాలనుకుంటే మరోసారి జగనన్నను సీఎం చేద్దాం
- మీ బిడ్డగా జగనన్నను, నన్ను ఆశీర్వదించండి
- ఆసరా నాలుగో విడత నగదు పంపిణీలో ఉప్పాల రాము



నాలుగో విడత ఆసరా చెక్కును అందజేస్తున్న ఉప్పాల రాము, హారిక దంపతులు



ఘంటసాలలో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెడన: మీకు మంచి చేసిన వారిని ఎప్పుడూ మరచిపోవద్దని, మీకు మళ్లీ మళ్లీ మంచి కావాలనుకుంటే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. స్థానిక పెడన వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం సాయంత్రం మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత మహాత్మగాంధీ చిత్రపటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మేనిఫెస్టోలో పెట్టిన పథకాలే కాకుండా ఇతర పథకాల ద్వారా పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సీఎం జగన్ పరిపాలన చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా పథకాల అమలుకు దళారీ వ్యవస్థ లేకుండా పేదలకు నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారని గుర్తు చేశారు. కరోనా కష్ట సమయంలో కూడా ఆదుకున్నారని, అటువంటి వ్యక్తికి మనం అండగా ఉందామన్నారు. ఆయన్ని సీఎం చేయడానికి మన వంతుగా స్థానికంగా తనను గెలిపించాలని కోరారు. పెడన పట్టణంలో శుద్ధజలం అందించడానికి తాను కృషి చేస్తానని చెప్పారు. పట్టణంలోని 407 డ్వాక్రా గ్రూపుల్లో 4,087 మంది సభ్యులకు రూ.2.86 కోట్లు నాలుగో విడత ఆసరా నిధులను విడుదల చేశారు. సమావేశంలో కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ పరిశీలకులు తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, కౌన్సిలర్లు, మెప్మా అధికారులు, ఆర్పీలు, డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు పాల్గొన్నారు.

ఘంటసాలలో రూ.6.92 కోట్ల విలువైన ఆసరా చెక్కులు పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ద్వారా వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా కల్పించారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఘంటసాలలో మంగళవారం నాలుగవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.6,92,15,526 ఆసరా చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు, పార్టీ యువనేత సింహాద్రి వికాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డ్వాక్రా మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ కోఆర్డినేటర్ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కుంపటి నాగేంద్ర, మాడెం నాగరాజు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, సర్పంచ్ ముళ్ళపూడి పట్టాభిరామారావు, ఏపీఎం అమలేశ్వరరావు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కొల్లూరి ప్రమీలరాణితో పాటు పలువురు పార్టీ నాయకులు, సీసీలు, బుక్‌కీపర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గాంధీ జీవితం యువతకు ఆదర్శం

ఉపకులపతి జ్ఞానమణి



మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ జ్ఞానమణి



బందరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

కోనేరుసెంటర్: దేశ స్వాతంత్య్రం కోసం గాంధీ మహాత్ముడు అహింసా మార్గాన్ని ఎంచుకోవడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయంలో అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వీరబ్రహ్మాచారి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో...

మచిలీపట్నంటౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కోతి సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాదచారులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, రంగనాయకులు, శ్రీకాకోళపు రేణుకారాణి, వేముల శిరీష, జల్లూరి దివ్యశ్రీ, అన్నం అశోక్, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, వాసవీక్లబ్ జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ, కార్యదర్శి జల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో...

అవనిగడ్డ: మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, ఎస్సీసెల్ నాయకులు వెన్నా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగాయలంకలో...

నాగాయలంక: మండల ఆర్యవైశ్య సంఘం, జై వాసవీ సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీజీ 76వ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం, వాసవీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సంఘం కార్యకర్తలు గొడవర్తి యజ్ఞనారాయణ, విస్సంశెట్టి శ్రీనివాసరావు తొలుత గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, చిట్టా బాలపాపారావు, చిట్టా వెంకట శేఖర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో హెచ్ఎం జయంతి పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మోపిదేవి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

పెడనలో...

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నాతో పాటు పలువురు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆత్మకూరి సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా, ప్రధాన కార్యదర్శి కేటీ మురళీకృష్ణ, కార్యదర్శి జవ్వాజి నాగు, ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు, చిట్టూరి పశుపతినాథ్ బాబు, జల్లూరి రాంబాబు, కృష్ణాజిల్లా వాసవి సేవాదళ్ వైస్ చైర్మన్ చిలకల బాలాజీ గుప్తా పాల్గొన్నారు.

చల్లపల్లిలో...

చల్లపల్లి: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు కార్యదర్శి వరదా హరిగోపాల్, సంఘ నాయకులు పాల్గొన్నారు. జెడ్పీ హైస్కూల్ వద్ద ఉన్న గాంధీ స్మృతివనంలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ కృష్ణకుమారి, ఈఓ మాధవేంద్రరావు నివాళులర్పించారు.

ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు

కోడూరు: దేవదాయ శాఖ అధీనంలో ఉన్న రెండు ఆలయాలకు సంబంధించిన హుండీల కానుకలను మంగళవారం అధికారులు లెక్కించారు. మండలంలోని లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారికి హుండీ ద్వారా రూ.36,559, పిట్టల్లంకలోని బాలనాగేశ్వర స్వామివారికి హుండీ ద్వారా రూ.19,886 ఆదాయం లభించినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆరు నెలల కాలానికి ఈ ఆదాయం లభించినట్లు చెప్పారు. లెక్కింపుల్లో ఈఓ సుధాకర్, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ వీఆర్వో మత్తి గోపాలకృష్ణకు సన్మానం



మోపిదేవిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవిలంక వీఆర్వో మత్తి గోపాలకృష్ణప్రసాద్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి గోపాలకృష్ణ ఉత్తమ వీఆర్వోగా అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. దీనిని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న వీఆర్వోకు శాలువా కప్పి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, సచివాలయ అధికారులు, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌టీఏ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిక్ రోడ్డు భద్రత ఆవశ్యకతను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఆర్‌టీఏ అసిస్టెంట్ లోకనాథ్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు మంగళవారం తెలిపారు. భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రైలుపేట, భాస్కరపురం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా..

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

అవనిగడ్డ: ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేస్తే ఏ పోటీ పరీక్ష అయినా విజయం సాధించవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రగతి విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం గ్రూప్ 2, డీవైఈవో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రూప్ 2, డీవైఈవో పరీక్షకు సంబంధించి మంచి మార్కులు సాధించడానికి మెలకువలు నేర్పించారు. పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయడం ద్వారా మంచి మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 14వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఆరునెలల కాలంలో 6 వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసినట్టు చెప్పారు. అనంతరం గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించి ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల సామాజిక ఆర్థిక చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సనకా పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, మండల కార్యదర్శి జీవేంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కూనపరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న త్యాగరాజ కీర్తనలు

మచిలీపట్నంటౌన్: స్థానిక వివేకానంద మందిరంలో త్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 177వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు మంగళవారం రెండో రోజు జరిగాయి. విశ్వనాథ శాంతికుమారి, లింగరాజు విజయలక్ష్మి, రాజారాం, మాధవి తదితర గాయకులు మధురంగా ఆలపించిన త్యాగరాజ స్వామి కీర్తనలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. గాయని కె.ఉమ రాముని సమానం ఎవరు అని పాడిన కీర్తన ఆకట్టుకుంది. విజయలక్ష్మి పంచరత్న కీర్తనల బృందగానంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై ఎస్.ప్రసాద్‌వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమానికి 25వ డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

బడ్జెట్ సమావేశంలో కీలక ఆమోదాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ 2024–25 బడ్జెట్ ఆమోదం

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలను ఆమోదించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని శాఖా గ్రంథాలయ భవన నిర్మాణాలకు రూ.3 కోట్లు, కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2 కోట్లు, పుస్తకాల కొనుగోలుకు కోటి రూపాయలు, ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం రూ.16 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు. దీంతో పాటు 15 అంశాలకు సమావేశం ఆమోదం తెలిపింది. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి నగేష్ అంశాలను చదివి వినిపించగా సభ్యులు ఆమోదం తెలిపారు.

క్రికెట్ జిల్లా పోటీలకు బలరామునిపేట జట్టు



మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో బలరామునిపేట క్రికెట్ జట్టు ప్రథమస్థానం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైంది. పెదపట్నం జట్టుకు బలరామునిపేట జట్టుకు మంగళవారం స్థానిక నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన పెదపట్నం జట్టు 10 ఓవర్లకు 55 పరుగులు చేయగా, తరువాత బ్యాటింగ్‌కు దిగిన బలరామునిపేట జట్టు 8 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన బలరామునిపేట జట్టుకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ వెంకటేశ్వరమ్మ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, పర్ణం సతీష్, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాల బారిన పడకుండా ఉండవచ్చునని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద హ్యాండ్ వాషింగ్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

ఉల్లిపాలెంలో 857 మందికి వైద్యపరీక్షలు

కోడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మరింత మెరుగైన వైద్యం అందుతుందని, ప్రజలందరూ ప్రత్యేక వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఉల్లిపాలెం సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష రెండవ విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ప్రజారోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాల్లో ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లజోళ్లను కూడా ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. వైద్యాధికారులు సచివాలయ పరిధిలోని ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, హరిపురం, స్వతంత్రపురం గ్రామాలకు చెందిన 857 మందికి వైద్యసేవలందించారు. సుగర్, బీపీ పరీక్షలతో పాటు ఈసీజీలను కూడా తీశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి వి.పావని, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, సనకా శైలజ, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల తీరు అభినందనీయం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

పెడన: మానవతా దృక్పథంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మెప్పును అందుకుంటున్న స్వచ్ఛంద సంస్థల పనితీరు అభినందనీయమని ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పలు ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. సంస్థ రాష్ట్ర కన్వీనర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 115 శాఖల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వీర శేషగిరిరావు, పెడన శాఖ అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి, ముదిగొండ శాస్త్రి, ఉమ్మిటి విద్యాధర్, కాగిత సాంబశివరావు, మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు సాయికృష్ణప్రసాద్, లంకిశెట్టి బాలాజీ, ఐఏఎస్ అకాడమీ చైర్మన్ దిట్టకవి వెంకటేశ్వరరావు, ఎంఈవో హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. సభానంతరం మానవత స్వచ్ఛంద సంస్థ డైరీని హారిక అవిష్కరించారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

చల్లపల్లి: స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో మంగళవారం గణతంత్ర దినోత్సవ అవార్డు గ్రహీతలకు మహాత్మా జ్యోతిరావు పూలే అభిమాన సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఉత్తమ అవార్డులు అందుకున్న చల్లపల్లి సబ్ డివిజన్ పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ, చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, చల్లపల్లి పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, లక్ష్మీపురం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ముక్కొల్లు సాయిసంధ్య, చల్లపల్లి పోలీస్‌స్టేషన్ రైటర్ వక్కలగడ్డ పవన్, మండల పరిషత్ కార్యాలయ సబార్డినేట్ రామలక్ష్మిలకు ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ (నాని), వక్కలగడ్డ పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేలా జగనన్న అడుగులు

పెడన: క్రీడాకారులను ప్రోత్సహించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని, అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో విజేతలకు డల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ పరిశీలకుడు తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, పెడన, గూడూరు ఎంపీపీలు వాణి, మధుసూదనరావు, గూడూరు జెడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం.ఫణిధూర్జటి, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ విజేతలు వీరే....

వాలీబాల్‌లో పురుషులలో మల్లంపూడి(బంటుమిల్లి), మాట్లం(కృత్తివెన్ను), కాకర్లమూడి(పెడన) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో చోరంపూడి(బంటుమిల్లి), పుల్లపాడు(పెడన), యండపల్లి(కృత్తివెన్ను) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బ్యాడ్మింటన్ పురుషులలో ఆగస్తేశ్వరపురం(పెడన), బంటుమిల్లి-2, గూడూరు-1, మహిళల విభాగంలో నాగేశ్వరరావుపేట(బంటుమిల్లి), కోకనారాయణపాలెం(గూడూరు), లక్ష్మీపురం(కృత్తివెన్ను) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఖోఖో పురుషులలో లక్ష్మీపురం(కృత్తివెన్ను), బల్లిపర్రు(పెడన), పెదతుమ్మిడి(బంటుమిల్లి), మహిళలలో చినగొల్లపాలెం(కృత్తివెన్ను), బ్రహ్మపురం(పెడన), పెదతుమ్మిడి(బంటుమిల్లి), కబడ్డీలో పురుషులలో పెదతుమ్మిడి(బంటుమిల్లి), ఐదుగుళ్లపల్లి(గూడూరు), నీలిపూడి(కృత్తివెన్ను), మహిళలలో మలపరాజుగూడెం(బంటుమిల్లి), యండపల్లి(కృత్తివెన్ను), నందిగామ(పెడన)జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. క్రికెట్‌లో పురుషులలో మాట్లం(కృత్తివెన్ను), ఆకులమన్నాడు(గూడూరు), దాదాగుంట ఏరియా(పెడన), మహిళలలో పెదతుమ్మిడి(బంటుమిల్లి), చినగొల్లపాలెం-2(కృత్తివెన్ను), గాంధీనగర్(పెడన) జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.